RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్ నెంబర్: 99637 08331

Malkajgiri | Volume: 2 | Issue: 298 | Wednesday, February 19, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక : 298 | బుధవారం, ఫిబ్రవరి 19, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

## ఏటీఎం సైజులో కొత్త రేషన్ కార్డు.....?




రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులపై వేగం పెంచింది. అందులో భాగంగా కొత్త రేషన్ కార్డులు ఎలా ఉండాలి, డిజైన్లు, రేషన్ కార్డులపై ఫ్యామిలీ ఫొటోలు ఉండాలా? వద్దా అనే వాటిపై సిఎం రేవంత్ రెడ్డితో అధికారులు చర్చిస్తున్నారు. ఒకవేళ కుటుంబసభ్యుల ఫొటోలు లేకపోయినా కుటుంబ సభ్యుల పేర్లు మొత్తం ఇందులో ఉంటాయని అధికారులు పేర్కొంటు న్నారు. కార్డు వెనుకవైపు అడ్రస్, రేషన్ షాపు నెంబర్, ఇతర వివరాలు కూడా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తమిళనాడు, కేరళ లాంటి తదితర రాష్ట్రాల్లో రేషన్ కార్డు తరహాలో ప్రభుత్వం ఇక్కడ రేషన్‌కార్డు తీసుకురాబోతున్నట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే పాత కార్డుల్లా కాకుండా స్మార్ట్ కార్డు రూపంలో ఏటిఎం కార్డు సైజులో అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది. ఈ మేరకు కార్డుల డిజైన్‌ను అధికారులు రెడీ చేస్తున్నారు. ఒకవైపు సిఎం ఫొటో, మరోవైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఫొటో, మధ్యలో ప్రభుత్వ లోగో ఉంటుందని అధికారికవర్గాల సమాచారం. ఇప్పటికే పలు రేషన్ కార్డు డిజైన్లను అధికారులు సిఎంకు చూపించారు. అయితే, ముందుగా లక్ష కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వీటి కోసం షార్ట్ టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజాపాలన, గ్రామసభలు, మీసేవ, కులగణనలో దరఖాస్తులు చేసుకున్న అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.

## బ్రెజిల్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం...



హైదరాబాద్ : రాష్ట్రంలో పెట్టుబడులు పెంచి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు స్టార్టప్‌ల అభివృద్ధికి రేవంత్ సర్కార్ మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్ , బ్రెజిల్‌కు చెందిన గోయస్ కంపెనీ ఆధ్వర్యంలో పనిచేసే హబ్ గోయస్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు.. ఆ సంస్థ ప్రతినిధులతో నేడు హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో ఈ సమావేశం జరిగింది. మీటింగ్ అనంతరం టీ హబ్ సి ఈ ఓ ఆజిత్ జాగిర్దార్, గోయస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయని అధికారులు అంచనాకు వచ్చారు. ప్రధానంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారంతో ముందుకెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు.

## సైబర్ నేరాల కట్టడికి ఐక్య పోరాటం!




**హైదరాబాద్ :** సైబర్ క్రైమ్ నియంత్రణలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా మార్చుతామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. హెచ్ఐసిసిలో మంగళవారం సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు షీల్డ్ కాంక్లేవ్ – 2025' సదస్సు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరాల మోసాలబారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేసే లక్ష్యంతో కొత్త ఆవిష్కరణలపై కాంక్లేవ్ ఏర్పాటు చేయగా, సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్, సైబర్ ఫ్యూజన్ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొదటిసారి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్ , సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌ను అభినందిస్తున్నానన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ 1 సైబర్- సేఫ్ స్టేట్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కొంతకాలంగా ఫేక్ న్యూస్ ప్రధాన ముప్పుగా పరిణమించిందని, ఇది పౌరులకు, ఆర్థిక వ్యవస్థకు సవాల్‌గా మారిందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారంతో గందరగోళ పరిస్థితికి దారి తీస్తుందన్నారు. సైబర్ సెక్యూరిట సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు నిపుణులు, ఐటీ సంస్థలతో కలిసి పనిచేసేందుకు, అన్ని రకాల వనరులు ప్రభుత్వం సమకూరుస్తోందన్నారు. డిజిటల్ సేఫ్టీ, ఫ్యూచర్ గురించి చర్చించేందుకు షీల్డ్ 2025 వేదికగా మారిందని, తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్ గా మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. సైబర్ మోసగాళ్ల బారినపడిన వారు వెంటనే ఫిర్యాదు చేయడానికి 1930 నంబర్ ను విస్తృతంగా ప్రచారం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సైబర్ నేరాలపై 24/7 హెల్ప్‌లైన్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకట అన్నారు. సైబర్ మోసాలలో నగదు రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉందని సీఎం వివరించారు.

## ఫోర్త్ సిటీ..ఓ రియల్ డ్రామా



ఆమనగల్లు: 420 దొంగ హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని మాజీ మంత్రి బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. సర్పంచ్ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే,పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుదీక్షలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. సిఎం ప్రతి రైతుకు ఎకరాకు రూ. 17500 బకాయి పడ్డారని, ఈ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేశాకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగాలని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంలో దుర్మార్గపు పాలన నడుస్తుందని విమర్శించారు. ఈ దరిద్రపు పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులు రాజుల బతికారని, కేసీఆర్ రైతుబంధు వేస్తే రేవంత్ ఇంకా వేస్తాననే అంటున్నాడని విమర్శించారు. కొడంగల్‌కు వలస వెళ్లిన రేవంత్‌రెడ్డి అక్కడ ఎవరికీ న్యాయం చేయలేదని, సొంత నియోజకవర్గం అయిన కల్వకుర్తి, అచ్చంపేటలకు ఏ ఒక్క పని చేయలేదని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి అత్తగారి ఊరు కల్వకుర్తిలో ఉన్న ఆడబిడ్డలకు రూ. 2500 ఇవ్వలేదు, తులం బంగారం ఇవ్వడం కాదా మెడలో పుస్తెల తాడు కూడా పట్టుకొని పోతాడంటూ కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. ప్రభుత్వానికి ఇంటికి పంపించే ఉపాయం లేదా అని అన్ని వర్గాల ప్రజలు అడుగుతున్నారని అన్నారు.

## ఆరోగ్యశ్రీకి నిధుల కొరత రానివ్వం!



**హైదరాబాద్ :** పేద, మధ్యతరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడే వైద్య ఆరోగ్య శాఖకు నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన వైద్య, ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశం లో సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు పలు సూచనలు చేశారు. గత దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వం లో ఈ మూడు విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చి రాబోయే రోజుల్లో బలోపేతం చేస్తామని తెలిపారు. డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాలను ఆధునికీకరిస్తామన్నారు.

## త్రివేణి సంగంలో పవన్ కళ్యాన్ దంపతుల పుణ్య స్నానం...!



ప్రయాగ రాజ్ %-% ఎ పీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉత్తర్ ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకు హాజరయ్యారు. ఇవాళ మధ్యాహ్నం ప్రయాగ్ రాజ్ చేరుకున్న పవన్.. సతీమణి అన్నా లెజ్నెవా, కుమారుడు అకీరా నందన్ తో కలిసి త్రివేణి సంగం లో పుణ్యస్నానం ఆచరించారు. ఈ సందర్భంగా పవన్ తో పాటు కుటుంబ సభ్యులకు స్థానిక పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. కుంభమేళాలో తొక్కిసలాటలు, అవాంఛనీయ ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో పవన్ కు పుణ్యస్నానం పూర్తయ్యే వరకూ రక్షణగా నిలిచారు.

## గంగమ్మ ఒడిలో..బ్యాక్టీరియా అలజడి



**న్యూఢిల్లీ :** ప్రయాగ్‌రాజ్ లోని గంగా, యమునా నదీ జలాల్లో మహా కుంభమేళా సందర్భంగా కొన్ని కోట్ల మంది స్నానాలు ఆచరించడంతో మానవ, జంతు మల విసర్జనాల సంబంధమైన కోలీఫామ్ బ్యాక్టీరియా విపరీతంగా వ్యాపించించడం ఆందోళన కలిగిస్తోంది. ఈమేరకు జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదిక సమర్పించింది. గంగా యమునా జలాల్లో అత్యధికంగా కోలీఫామ్ బ్యాక్టీరియా విస్తరించడంతో స్నానాలకు కావలసిన ప్రమాణాలు లేవని వెల్లడించింది. ఫిబ్రవరి 3న సమర్పించిన ఈ నివేదికలో ప్రయాగ్‌రాజ్ లోని సంగం వద్ద వివిధ పాయింట్ల వద్ద , ముఖ్యంగా షాహిస్నాన్ వద్ద కోలీ బ్యాక్టీరియా అత్యధికంగా ఉందని పేర్కొంది. నీటి నాణ్యత గురించి వివరిస్తూ ఒక 100 మిల్లీ లీటర్ల నీటిలో 2500 కోలీఫామ్ బ్యాక్టీరియాలున్నా ఆ నీరు స్నానానికి యోగ్యమైనదేనని, అంతకు మించి ఉంటే చర్మసంబంధ వ్యాధులు వస్తాయని నివేదిక వెల్లడించింది. అయితే ఫిబ్రవరి 4న సిపిసిబి నమోదు చేసిన వివరాల ప్రకారం గంగానదిలో శాస్త్రి బ్రిడ్జి ముందు 100 మిల్లీ లీటర్ల నీటిలో 11,000 వరకు కోలీఫామ్ బ్యాక్టీరియాలు వరకు ఉండగా, సంగం వద్ద 7900 కోలీఫామ్ బ్యాక్టీరియాలు కనిపించాయన నివేదిక వివరించింది. సంగం ప్రదేశానికి 2 కిమీ ముందుగా గంగా నదిపై శాస్త్రి బ్రిడ్జి ఉంది. సంగం వద్ద గంగానదితో కలిసే ముందు యమునా నదిలో పాత నైని బ్రిడ్జి వద్ద 100 మిల్లీ లీటర్ల నీటిలో 4900 కోలీఫామ్ బ్యాక్టీరియాలు బయటపడ్డాయి. షాహిస్నాన్ ఆచరించే రోజుల్లో ఒకటైన బసంత్ పంచమి నాడు ఈ డేటాను సేకరించారు. ఫిబ్రవరి 3న బసంత్ పంచమి వచ్చింది.

తెలంగాణ షాన్

## సంపాదకీయం

# మతఛాందసానికి బలైన సహజ మేధావి!

అభూత కల్పనలకు అలవాటుపడ్డ జనం వాస్తవాల్ని వాస్తవాలుగా స్వీకరించరు. సహజత్వాన్ని సహజత్వంగా అంగీకరించరు. అందులో కూడా వారికేవో అనుమానాలు, భయాలు తలెత్తుతూ ఉంటాయి. మంత్రాలేస్తారనో, చేతబడి చేస్తారనో కొందరిని కొట్టి చంపడం అప్పుడప్పుడు చూస్తుంటాం. మంత్రాలకు చింతకాయలు రాలవని తెలిసి కూడా మంత్ర కళలున్నాయంటే జనం భయపడుతున్నారు. ఈ పరిస్థితి మారాలి. ఇది ఇప్పటి పరిస్థితే కాదు, వందల యేళ్ల నుండి ఈ ధోరణి సమాజంలో ఉంది. ఉదాహరణకు ఖగోళ సిద్ధాంత కర్త, గణిత శాస్త్రజ్ఞుడు అయిన గియార్డనో బ్రూనో (1548 1600) విషయం చూద్దాం. ఆయన బుద్ధికుశలతని, మేధాశక్తిని మతఛాందసవాదులు భరించలేకపోయారు. ఆయనలో సైతాను ప్రవేశించిందని రక్తం చిమ్మకుండా సజీవంగా నిప్పంటించి కాల్చారు. బ్రూనో తండ్రి జియోవన్ని బ్రూనో ఒక సైనికుడు. ఆయన తన కొడుకును విద్యా భ్యాసంకోసం నాప్లస్‌కు పంపాడు. అక్కడ ఆగస్టియన్ మొనస్ట్రీ (సన్యాసుల ఆశ్రమం)లో ఉంటూ బ్రూనో ప్రైవేటుగా విద్యనభ్యసించేవాడు. అక్కడికి దగ్గరలో ఉన్న స్టేడియంలో అప్పుడప్పుడు సాగే ఉపన్యాస కార్యక్రమాలకు వెళుతుండేవాడు. మొనస్ట్రీలో ఈయనకు గియార్డనో క్రిస్‌పో అనే ట్యూటర్ మెటాఫిజిక్స్ బోధిస్తుండేవాడు. ఆ ట్యూటర్ ప్రభావంలో బ్రూనో ఎంతగా పడిపోయాడంటే, తన పేరులోని 'ఫిలిప్పో'ను వదిలేసి 'గియార్డనో' పేరు తగిలించుకున్నాడు. అక్కడ పదిహేడో యేట మొనస్ట్రీలో డొమినికన్ ఆర్డర్‌లో ప్రవేశించాడు. అంటే ప్రభు విశ్వాసకుల్లో ఒకడిగా గుర్తింపు వచ్చిందన్నమాట! శిక్షణ పూర్తి చేసుకుని 1572 నాటికి అంటే తన ఇరవై నాలుగవ యేట మత బోధకుడి (ప్రీస్ట్)గా అయ్యాడు. అప్పటికే అతని అమోఘమైన జ్ఞాపకశక్తి, గణితం మీద పట్టు అందరూ గుర్తించసాగారు. ఓసారి రోమ్ నగరానికి వెళ్లి ఏదో పోస్ పయస్, అలాగే కార్డినల్ రిబిబాల ముందు తన ప్రజ్ఞాపాటవాల్ని ప్రదర్శించి వచ్చాడు. "ఆన్ ద ఆర్క్ ఆఫ్ నోహ్" అనే తన సూత్రీకరణల్ని మత పెద్దలు అంగీకరించారని చెప్పుకున్నాడు. 1576 1592 మధ్య కాలంలో పుస్తకాలు రాస్తూ, కొంత కాలం ఉపన్యాసకుడిగా పని చేస్తూ, దేశ విదేశాల్లో విస్తృతంగా పర్యటించాడు. బ్రూనో ఖగోళ సిద్ధాంత కర్త మాత్రమే కాక, కవి, తత్వవేత్త కూడా కాబట్టి అనేకానేక, విభిన్నమైన రచనలు చేశాడు. వెన్నిస్‌లో ఉన్నప్పుడు 'కాలపు చిహ్నాలు' ప్రచురించాడు. యూనివర్శిటీ ఆఫ్ జెనీవాలో కొంత కాలం, ఫ్రాన్స్‌లోని పారిస్‌లో కొంత కాలం గడిపాడు. ఫ్రాన్స్ లయాన్‌లో ఉన్నప్పుడు డాక్టరేట్ తీసుకున్నాడు. ఆయన ఉపన్యాసాలకు ఆకర్షితులైన విద్యార్థులు ఆయనే తమకు అధ్యాపకుడిగా కావాలన్నారు. పారిస్‌లో ఓ ముప్పయి ఉపన్యాసాలిచ్చాడు. వాటి వల్ల గొప్ప కీర్తి గడించాడు. ఆయన ఉపన్యాసాలన్నీ క్రైస్తవానికి వ్యతిరేకంగా ఉండడం వల్ల, ఆయన వృత్తి రీత్యా మత బోధకుడన్న విషయం మరుగునపడింది. బ్రూనో పేరు ప్రఖ్యాతుల గూర్చి తెలుసుకున్న రాజు మూడవ హెన్రీ ఒకసారి బ్రూనోను పిలిపించుకుని "నీ తెలివితేటలు సహజమైనవా లేక ఏవైనా మంత్రకళల వల్ల అబ్బినవా?" అని ప్రశ్నించాడు. అందుకు బ్రూనో "తనకు మంత్ర కళలేవీ తెలియవని, తనది సహజమైన మేధస్సేనని" విన్నవించుకున్నాడు. అంతేకాదు, "ఆలోచన ఛాయలు" (1582) పేరుతో పుస్తకం రాసి ఆయనకు అంకితమిచ్చాడు. రాజు మూడవ హెన్రీ సంతోషించి వెంటనే ఉపన్యాసకుడిగా నియమించి, మంచి జీతం ఏర్పాటు చేశాడు. వైజ్ఞానికుడు, తత్వవేత్త, కవి అయిన బ్రూనో ఉపన్యాసకుడిగానే కాదు, రచయితగా కూడా ప్రసిద్ధుడయ్యాడు. ఆ కాలంలోనే 'జ్ఞాపక కళ' (1582), 'వృత్త గీతం' (1582) వంటి సాహిత్య గ్రంథాలు ప్రకటించాడు. ముఖ్యంగా అవి అనుభవాలకు, జ్ఞాపకాలకు సంబంధించినవి. అదే సంవత్సరం ప్రకటించిన 'దివిటీ ధారుడు' హాస్యరస ప్రధానమైన తాత్విక గ్రంథం. ఆ మరుసటి సంవత్సరం రాజు మూడవ హెన్రీ సిఫారసుతో బ్రూనో ఇంగ్లాండు చేరాడు. అక్కడ కవులు ఫిలిఫ్ సిడ్నీ, జాన్. డి వంటి వారి స్నేహం లభించింది. ఆక్స్‌ఫర్డ్‌లో ఉపన్యసించే అవకాశమూ లభించింది. అక్కడ ఒక సంవత్సర కాలంలోనే నాలుగు పుస్తకాలు ప్రచురించ గలిగాడు. అంటే ఆయన మేధో సంపద, రచనా కౌశలంఎంత గొప్పదో బేరీజు వేసుకోవచ్చు. "ఇటాలిన్ డైలాగ్స్" "కారణం: సూత్రీకరణల ఐక్యత" "అనంత విశ్వం: ప్రపంచాలు" వంటివన్నీ వెంట వెంట ప్రచురించాడు. అయితే "ద ఏష్ వెన్స్ డే సప్పర్ మాత్రం చాలా వివాదాస్పదమైంది. విషయం కుండబద్దలు కొట్టినట్టు చెప్పడం వల్ల కొందరు మిత్రులే నొచ్చుకుని ఆయనకు దూరమయ్యారు. క్యాథలిక్ కుట్రదారుల కుట్రల్ని క్వీన్ ఎలిజబెత్ సెక్రటరీకి 'హెన్రీ షాగెట్' అనే మారుపేరుతో చేరవేస్తుండేవాడు. అక్టోబర్ 1585 లో లండన్‌లోని ఫ్రెంచ్ రాయబారి కార్యాలయంపై కొందరు దాడి చేశారు. అందులోనే ఉన్న బ్రూనో, ఇక అక్కడ ఉండడం క్షేమకరం కాదని, ఉద్రిక్తమైన రాజకీయ పరిణామాల వల్ల పారిస్‌కు వెళ్లిపోయాడు. తర్వాత జర్మనీకి చేరుకున్నాడు. జర్మనీలో అనుకున్నంతగా మంచి బోధనావకాశాలు రాలేదు గాని, విట్టెన్‌బర్గ్‌లో చిన్న అవకాశం లభించింది.

# రాచకొండ పోలీసుల వేగవంతమైన, నిష్పాక్షిక విచారణతో నేరస్తులకు కఠిన శిక్షలు

### - అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పాత కక్షలతో ఒక వ్యక్తిని చంపిన కేసులో 17 మంది నిందితులకు జీవితఖైదు శిక్ష
### - ఎస్సీ, ఎస్టీల మీద నేరాలకు పాల్పడే వారి మీద కఠిన చర్యలు: సీపీ సుధీర్ బాబు ఐపీఎస్
### - తాత్కాలిక ఆవేశాలకు లోనై ఎవరూ చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదు: సీపీ సుధీర్ బాబు ఐపీఎస్

**తెలంగాణ షాన్, ఫిబ్రవరి 18:**
అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో పాత కక్షలతో ఒక వ్యక్తిని చంపిన సంఘటన Cr.NO 76/2017 కేసులో 17 మంది నిందితులకు నల్గొండలోని ఎస్సీ ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు ఈ రోజు జీవిత ఖైదు శిక్ష విధించడం జరిగింది.

కొందరు ఆవేశపరుల కుల అహంకారం, పాత కక్షలు, తాత్కాలిక ఉద్రేకం అన్నీ కలిసి ఒక వ్యక్తి మరణానికి కారణమైన సంఘటన అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో 2017 సంవత్సరంలో జరిగింది. ఈ కేసులో వివరాలను పరిశీలిస్తే ఈ సంఘటనలో మృతుడు బట్ట లింగయ్య గతంలో అదే గ్రామానికి చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన ఒక వ్యక్తి మరణానికి కారణమయ్యి బెయిలు మీద బయటకు రావడం జరిగింది. ఆ పగను మనసులో ఉంచుకున్న అతని కుటుంబ సభ్యులు మరియు తోటి కులస్తులు దసరా పండుగ సందర్భంగా జరిగే ఉత్సవాల్లో మృతుడు బట్ట లింగయ్య కుటుంబంతో సహా పాల్గొనడానికి వెళ్తున్న క్రమంలో గతంలో తన వల్ల చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఎదురుకాగా వారు క్షణికావేశంతో ఉద్రేకానికి లోనై, దుర్భాషలాడుతూ విచక్షణ రహితంగా, సామూహికంగా భౌతిక దాడికి పాల్పడడం మూలంగా తీవ్ర గాయాల పాలై మృతి చెందడం జరిగింది.

ఈ ఉద్రిక్త ఘటన గురించిన సమాచారం అందిన తక్షణమే రంగంలోకి దిగిన అడ్డగూడూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు U/S,147, 302, 323 504 R/W 149 &109 IPC & సెక్షన్ 3(1)(r)(s),3(2)(va) ఎస్సీ ఎస్టీ చట్టం, మరియు అడ్డగూడూరు స్టేషన్ SC No 45/2018 ప్రకారం కేసు నమోదు చేసిన అనంతరం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కేసు విచారణ ప్రారంభం అయింది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రమేష్ అప్పుడు ఎసిపి హోదాలో ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా వేగవంతంగా నిర్వర్తించి, పక్కా సాక్ష్యాధారాలను సేకరించి కోర్టు ముందు ఉంచడం జరిగింది. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలు వినిపించారు. సాక్ష్యాదారాల పరిశీలన అనంతరం నల్గొండలోని ఎస్సీ ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు ఈ కేసులో 17 మంది నిందితులు ఒక్కొక్కరికి జీవిత ఖైదు శిక్ష మరియు రూ.6000/- జరిమానా విధించింది.

తాత్కాలిక ఆవేశంలో విచక్షణను మరిచి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడేవారు తగిన శిక్షను అనుభవించాల్సి వస్తుందని, తమ చక్కటి భవిష్యత్తును కోల్పోయి జైలు జీవితం గడపాల్సి వస్తుందని కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ గారు పేర్కొన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ వ్యక్తులు తాత్కాలిక ఆవేశాలకు లోనుకాకూడదని, కులతత్వాన్ని విడనాడాలని, చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదని సూచించారు. ఎస్సీ ఎస్టీ చట్టాన్ని పూర్తిస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేయడానికి రాచకొండ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, నేరస్తులకు చట్ట ప్రకారం శిక్షలు విధించేలా చేస్తున్నామని, బాధితులకు తగిన న్యాయం అందించడానికి నిష్పాక్షిక మరియు వేగవంత విచారణ విధానాలను అనుసరిస్తున్నామని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. రాచకొండ పరిధిలో అన్ని రకాల నేరాలు అదుపుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ చట్టం అమలుకు మరియు మహిళల పట్ల జరిగే నేరాల అదుపుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.



ఈ కేసులో శిక్ష విధించబడ్డ నిందితులు: A1)పండుగ రామస్వామి S/o రాజమల్లు వయస్సు:21, వృత్తి: విద్యార్థి, కులం: యాదవ్, A2) పండుగ సాయిలు S/o రామస్వామి, వయస్సు: 40 సం,, కులం: యాదవ్, వృత్తి: వ్యవసాయం రాములు, 5 సం,: పాండుగ రాములు, 5 సం, కులం: యాదవ్ A4) పండుగ మల్లేష్ S/o చిన్న రాములు వయస్సు: 25 సం, కులం: యాదవ్ వృత్తి: విద్యార్థి, A5) బండగొర్ల వలరాజు S/o రామచంద్ర, వయస్సు:35 సం,, కులం:యాదవ్, వృత్తి: వ్యవసాయం, A6) పండుగ యాదయ్య S/o. వీరమల్లు, వయస్సు: 42 సం, వృత్తి: వ్యవసాయం, కులం: యాదవ్, A7)జక్కుల రమేష్/ఓ బిక్షం, వయస్సు:25 సం,, కులం:యాదవ్, వృత్తి:విద్యార్థి A9) విద్యార్థి, A11) పండుగ నర్సాయిష్ S/o రామస్వామి, వయస్సు: 50 సం, కులం: యాదవ్, వృత్తి: వ్యవసాయం, A12) పండుగ సత్యనారాయణ S/o పిత్చియా, వయస్సు: 30 సం, కులం: యాదవ్ వృత్తి: వ్యవసాయం, A13) బండగొర్ల నాగమ్మ W/o వర్రాజు, వయస్సు: 30 ఏళ్ల కులం : యాదవ్ వృత్తి: వ్యవసాయం, A14) పండుగ శ్రీను / ఓపెద్ద పిచ్చయ్య, వయస్సు: 30 సం, కులం: యాదవ్, వృత్తి: వ్యవసాయం, A15) పనగ మల్లయ్య S/o. పెద్ద పిచ్చయ్య వయస్సు: 40 సం,, కులం: యాదవ్, వృత్తి: వ్యవసాయం, A16) పండుగ లింగయ్య S/o. పెద్ద పిచ్చయ్య, వయస్సు: 35 సం,, కులం: యాదవ్, వృత్తి: వ్యవసాయం, A17) జక్కుల లచ్చయ్య, S/o బక్కయ్య, వయస్సు: 38 సం,, కులం: యాదవ్, వృత్తి: వ్యవసాయం A18) పిలబోయిన లింగయ్య S/o. ఐలయ్య, వయస్సు: 40 సం,, కులం:యాదవ్, వృత్తి:సర్పంచ్ R/o: అజీంపేట (V) గ్రామం, అడ్డగూడూరు (M). A8) జక్కుల.బిక్షమయ్య S/o బక్కయ్య, వయస్సు: 45 సం, ఈ కేసు విచారణలో ఉండగా మరణించడం జరిగింది.

# సాయిబాబా నగర్ లో రూ.36లక్షల వ్యయంతో సి.సి.రోడ్ల పనులు

### - ప్రారంభించిన కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి



**కాప్రా ఫిబ్రవరి 18 తెలంగాణ షాన్ ప్రతినిధి జి. ఆంజనేయులు**
కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ఈరోజు సాయిబాబా నగర్ లో రూ.36లక్షల వ్యయం తో సి.సి.రోడ్ల నిర్మాణము పనులు ప్రారంభించారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మాట్లాడుతూ - కాప్రా డివిజన్ అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తున్నానని,గ్రేటర్ హైదరాబాద్ లో మొదటి డివిజన్ కావడం తో మన రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహము మరియు నియోజక వర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారముతో డివిజన్ సమస్యలను పరిష్కరించడములో సఫలీకృతులైతున్నానని తెలిపారు. సాయిబాబా నగర్ లో ప్రస్తుతము 9 వీధుల్లో నిర్మించనున్న సి.సి.రోడ్ల నిర్మాణపనులతో సాయిబాబా నగర్ పూర్తిగా రోడ్ల నిర్మాణముతో ప్రజల రోడ్ల అవస్థ తీరనుందని తెలిపారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ- కాప్రా డివిజన్లోని సాయిబాబానగర్ లో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి నియోజక వర్గ అభివృద్ధికై పట్టువదలని విక్రమార్కుడిలా సియం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెల్తూ వందల కోట్ల నిధులు మంజూరు చేయిస్తూ నియోజకవర్గం అభివృద్ధికై పాటుపడుతున్నారని తెలిపారు. కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అహర్నిశలు డివిజన్ ప్రజలకు అందుబాటులో ఆయా కాలనీలు బస్తీల సమస్యల పరిష్కరించడానికి కృషిచేయడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భగా సాయిబాబా నగర్ కావాలనీవాసులు కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి కి కృత్ణతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తో పాటు జిహెచ్ఎంసి-కాప్రా డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ అసిస్టెంట్ ఇంజనీర్ సూరజ్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ కాప్రా డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్ , సాయిబాబానగర్ వాసులు ప్రదీప్ , చోటు భాయ్ , షకీల్ , కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి , సంతోష్ చారి , జి సత్యనారాయణ , టి శ్రీహరి , ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు..

# సంజన కోర్టీ యార్డులో ఐకాన్ ఐవిఎఫ్ ఫ్రీ హెల్త్ క్యాంప్ నిర్వహించిన డాక్టర్ నల్ల కావ్య గౌడ్

**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 18 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్** మేడ్చల్ జిల్లాలో ని కండ్లకోయ లో సంజన కోర్టీ యార్డ్ లో ఐకాన్ ఐవిఎఫ్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఫెర్టిలిటీ మరియు గైనిక్ సమస్యల పైన క్యాంప్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నల్ల కావ్య గౌడ్ మాట్లాడుతూ నేటి దైనందిక జీవితంలో అనేక రకాల పని ఒత్తిళ్లు, జంక్ ఫుడ్డు మరియు శారీరక శ్రమ లేకపోవడం వల్ల దంపతులలో సంతానం లేని సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ సమస్యలను అధిగమించాలంటే సరియైన డాక్టర్ సంప్రదించి వారిచ్చే ట్రీట్మెంట్ చేసుకుంటే సంతానంలో లేమి సమస్యను అధిగమించవచ్చని తెలిపారు. ఈ సమస్య పట్ల ఎవరూ కూడా నిరాశ చెందకూడదని నేటి యుగంలో రకరకాల వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలియజేశారు. మనోధైర్యం కోల్పోకుండా సరైన సమయంలో చికిత్సను తీసుకొని తల్లిదండ్రులు కావాలనే కలను నిజం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె సంజన కోటి చైర్మన్ ప్రభాకర్ గౌడ్ మరియు ప్యానల్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.




## జవహర్ నగర్ లో అక్రమ కట్టడాలపై...

# హెచ్ఎండిఏ అధికారులు కూల్చివేత





**మేడ్చల్ మల్కాజిగిరి తెలంగాణ షాన్, ఫిబ్రవరి 18:**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మండలం, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హెచ్ఎండిఏ ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను భారీ పోలీసు బలగాలతో తొలగించారు. హెచ్ఎండిఏ తహసీల్దార్ దివ్య రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, హెచ్ఎండిఏ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 706లో కొందరు భూమిని అక్రమంగా ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. వారానికి ముందు ఫీల్డ్ అధికారులు వివిధ ప్రాంతాల్లో పరిశీలన నిర్వహించి, అక్రమ నిర్మాణాలపై నివేదికను అధికారులు అందుకున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 18 (మంగళవారం) నాడు పోలీసు బలగాలు, రెవిన్యూ యంత్రాంగం సహాయంతో సర్వే నంబర్లు 706, 701, 702, 703లలో నిర్మించిన 15 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అక్రమంగా ప్రభుత్వ భూమిలో



నిర్మాణాలు చేపట్టిన వారి మీద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హెచ్ఎండిఏ తహసీల్దార్ దివ్య రెడ్డి, సైట్ ఆఫీసర్ రమణారెడ్డిని ఆదేశించారు. ఈ కార్యకలాపాల్లో సబ్ ఇన్‌స్పెక్టర్‌లు రాము, వేణు గోపాల్,హెచ్ఎండిఏ పోలీసు సిబ్బంది, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# చిల్కానగర్ మైనారిటీ కబ్రిస్తాన్‌లో మౌలిక సదుపాయాలకు అన్ని చర్యలు చేపడతాం : కార్పొరేటర్ బన్నాల



**ఉప్పల్, ఫిబ్రవరి 18:** చిల్కానగర్ డివిజన్ లో నీ మైనారిటీ కబ్రిస్తాన్ లో పెద్ద పెద్ద బండ రాళ్లు (బోల్డర్స్) తొలగించు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్,అనంతరం వారు మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ లో నీ మైనారిటీ ఖబరస్థాన్ లో కబ్రిస్తాన్ కమిటీ అధ్యక్షులు అబ్బో భాయ్ మరియు వారి కమిటీ సభ్యులు అభ్యర్థన మేరకు చనిపోయిన వారికి పూడ్చి పెట్ స్థలంలో పెద్ద పెద్ద బండరాళ్ల ఉండడం వల్ల ఇబ్బంది కలుగుతుందని విషయానికై బండరాళ్లు తొలగించు పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు.ఇచ్చిన మాట ప్రకారంగా మైనారిటీ సోదరులకు కబురస్థాన్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తానన్న హామీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో ఒక్కొక్కటిగా అన్ని పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని కొనియాడారు. కాంట్రాక్టర్ మల్లేష్ ని కార్పొరేటర్ గీతా ప్రవీణ్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నాడని ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పని చేయిస్తున్నాడని అభినందించారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఎద్దుల కొండల్ రెడ్డి, కొకొండ జగన్, సంతోష్ నాయక్, శ్యామ్, మైనారిటీ కబ్రాస్తాన్ కమిటీ అధ్యక్షులు అబ్బో భాయ్ , వారి కమిటీ సభ్యులు షఫీ, హనీఫ్ ,మహమూద్, మహమ్మద్, చోటే , బాబా, కాసిం,మొదలగు వారు పాల్గొన్నారు.

# అక్రమ వలసదారులను ఎలా గుర్తిస్తారంటే



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులను ఆ దేశం నుంచి పంపిస్తున్నారు. ఇందుకోసం దేశమంతా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వందల మందిని తరలించారు. ఇటీవలే 312 మందితో భారత్‌కు కూడా ఓ విమానం వచ్చింది. ఇందులో గుజరాత్, హరియాణా, పంజాబ్‌లకు చెందిన అక్రమ వలసదారులు ఉన్నారు. వారంతా స్వదేశానికి వచ్చారు. అమెరికా ఎవరిని బహిష్కరిస్తుంది.. మళ్లీ వారు అక్కడకు వెళ్లొచ్చా అన్న సందేహాలు కూడా కలుగుతున్నాయి.అమెరికా నుంచి ఎవరిని బహిష్కరిస్తున్నారనే వివరాలను మైగ్రేషన్ పాలసీ రిపోర్టు కొన్ని వివరాలు వెల్లడించింది. అనధికారికంగా ఉంటున్నవారినే బహిష్కరిస్తారని చాలా మంది భావిస్తున్నారు. అయితే దేశంలో చట్టబద్ధంగా నివసిస్తూ సిటిజన్‌షిప్ పొందని వలసదారులు కూడా కొన్ని పరిస్థితుల్లో బహిష్కరణకు గురికావొచ్చు. అనధికారిక వలసదారులు, అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించినవారు, వీసా గడువు ముగిసినా దేశంలో ఉంటున్నవారిని వారి దేశాలకు పంపించవచ్చు. తాత్కాలిక వీసాపై అమెరికాకు వెళ్లి అక్కడే నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్నవారిని కూడా బహిష్కరిస్తుంది. అక్రమ వలసదారులే కాకుండా అమెరికాలోని గ్రీన్‌కార్డు హోల్డర్లు, తాత్కాలిక వీసా హోల్డర్లు కూడా బహిష్కరణకు గురికావొచ్చు. అయితే ఈ కోవలోకి వచ్చే వక్తులు నేరాలకు పాల్పడినట్లు నిరూపణ కావాలి. ఈ నేరాలలో తాగి వాహనం నడపడం, అనుమతి లేకుండా ఆయుధాలతో దొరికిపోవడం, డ్రగ్స్ తీసుకోవడం, తిరగడం, హింసాత్మక నేరాలకు పాల్పడడం వంటివి ఉన్నాయిఅనైతిక చర్యలతో కూడిన నేరానికి పాల్పడిన వ్యక్తిని బహిష్కరించడానికి రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది అమెరికాలో నివసించిన మొదటి ఐదేళ్లలో అనైతికంగా భావించే నేరానికి పాల్పడడం, రెండోది వేర్వేరు కేసుల్లో రెండు లేదా అంతకన్నా ఎక్కువ అనైతిక నేరాలకు పాల్పడడం, రెండోదానికి కాలపరిమితి లేదు. అయితే అనైతిక చర్యలతో కూడిన నేరం అంటే ఏమిటో స్పష్టమైన నిర్వచనం లేదు. ఈ విషయంపై అమెరికా కోర్టులు ఎప్పటికప్పుడు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నాయి. వీటిలో మోసం, వ్యక్తులు లేదా ఆస్తికి హాని కలిగించే ఉద్దేశం, మరణ లేదా దోపిడీకి కారణమయ్యే వారు, భార్యాభర్తల మధ్య హింస మొదలైనవి.అమెరికా ఇమిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ (ఈఆర్వో) అధికారులు ఆ దేశంలో వలస చట్టాలను అమలు చేసే పనిలో ఉంటారు. ఈ అధికారులు నేషనల్ సెక్యూరిటీ వ్యవహారాలు చూస్తుంటారు. ఇమిగ్రేషన్ అమలు ప్రక్రియ అన్ని దశలను ఈఆర్వో నిర్వహిస్తుంది. ఇమిగ్రేషన్ అమలు ప్రక్రియ అన్ని దశలను ఈఆర్వో నిర్వహిస్తుంది. బహిష్కరణకు అర్హత ఉన్నవారి గుర్తింపు, అరెస్టు, నిర్బంధం, వారి దేశాలకు పంపిచే ప్రక్రియ తదితరాలు ఉంటాయి.ఇక బహిష్కరణకు అర్హులైన వ్యక్తులను గుర్తించడానికి లక్ష్య(టార్గెటెడ్), గూఢచార కార్యకలాపాలను ఈఆర్వో నిర్వహిస్తుంది. క్రిమినల్ అరెస్ట్ వారెంట్‌లను అమలుఏయడం, బహిష్కరణకు అర్హత ఉన్న వ్యక్తుల అరెస్టులతోపాటు ఇమ్మిగ్రేషన్ సంబంధిత క్రిమినల్ చర్యల కోసం ప్రాజిక్యూషన్ ప్రారంభించే అధికారం ఈఆర్వోకు ఉంది. ఈఆర్వో విభాగం అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ప్రధానంగాఎండు వర్గాలుగా విభజిస్తారు. ఒకటి అమెరికా పౌరసత్వం ఉన్నవారు, రెండోది అమెరికాలో వారి నేర చరిత్ర ఆధారంగా నిర్ణయిస్తారు..అమెరికాలో అమ్మకానికి ఇళ్లు90 రోజుల్లో 1200 ఇళ్లుఅగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. జనవరి 20న ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే ఆయన ఎన్నికల హామీలు నెరవేర్చడంపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలోనే మేక్ అమెరికా గ్రేట్ ఎగ్గె న్ నినాదంతో ముందుకు వెళ్తున్నారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రపంచ దేశాలు ఇబ్బంది పడుతున్నాయి. ప్రధానంగా అక్రమ వలసదారులను ఖైదీల్లా స్వదేశాలకు పంపుతున్నారు. జన్మతః సిటిజన్‌షిప్ రద్దు చేశారు. మరోవైపు కెనడా, మెక్సికో, చైనా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించారు. స్టీల్, అల్యూమినియం దిగుమతిపైనా భారీగా పన్ను విధించారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రపంచదేశాలతోపాటు అమెరికాలో ఉంటున్న విదేశీయులు ఇబ్బంది పడుతున్నారు. ఆ దేశ ప్రజలు కూడా భయపడుతున్నారు. దీంతో వాషింగ్టన్ డీసీలో రియల్ ఎస్టేట్ మార్కెట్ పతనం అవుతోంది. దీంతో వేల ఇళ్లను అమ్మకానికి ఉంచారు.అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో 14 రోజుల్లో 4,271 కన్నా ఎక్కువ ఇళ్లను అమ్మకానికి ఉంచారు. ఈవిషయాన్ని ఒక ఎక్స్ యూజర్ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఎలుకలు పారిపోతున్నాయి. అని కాప్షన్ ఇచ్చాడు. నగరవాసులు తమ వసుత్వులు సర్దుకుని సామూహికంగా నగరం విడిచి వెళ్లిపోతున్నారని తెలిపారు. ఈ వలసలకు కారణం ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ అని స్థానికులు చెబుతున్నారు. నగరంలో, చుట్టుపక్కలక అమ్మకానికి ఉన్న 14,825 ఇళ్లను చూపించే ఫొటోలు కూడా సోషల్ మీడియాలో షేర్‌చేశారు. నగరంలో 500లకుపైగా ఇళ్లు, రూ. 8 కోట్లకన్నా ఎక్కువ ధరకు అమ్మకానికి ఉన్నాయి వెల్లడించారు. అమెరికన్లను సురక్షితంగా ఉంచే విధానాలపై పనిచేసే థింక్ ట్యాంక్ అయిన సెంటర్ ఫర్ సెక్యూరిటీ పాలసీలో పనిచేస్తున్న సీనియర్ విశ్లేషకుడు తెలిపారు.ఆన్‌లైన్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్లేస్ అయిన జిల్లోలో అమ్మకానికి ఉన్న ఇళ్ల జాబితాను మరో ఎక్స్ యూజర్ షేర్ చేశాడు. ఏడు రోజుల్లో 201, 14 రోజుల్ల 378, 30 రోజుల్లో 706, 90 రోజుల్లో 1,198 కొత్త ఇళు అమ్మకానికి వచ్చినట్లు వివరించాడు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలను కూడా ఎక్స్‌లో పోస్టు చేశాడు. అక్రమ వలసదారులను తరలిస్తుండడంతో వారంతా అప్పటికే కొనుగోలు చేసిన ఇళ్లను అమ్మకానికి పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో ఇళ్ల అమ్మకాలు పెరుగుతున్నాయి.

# కవితక్క... కేరాఫ్ సిద్ధిపేట..



**మెదక్ :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న కవిత జైలు నుండి బెయిల్ పై బయటకు వచ్చారు. కొద్దిరోజులు పార్టీ స్థితిగతులు అంచనా వేసిన కవిత, ఆ తర్వాత స్పీడ్ పెంచారు. కవితకు బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ లో స్పెషల్ క్రేజ్ ఉంది. పార్టీ క్యాడర్ కూడా ఆమెకిచ్చే గౌరవంలో ఏమాత్రం తక్కువ చేయరు. ఉన్నది ఉన్నట్లు కుండబద్దలు కొట్టడంలో ఎవరైనా కవిత తర్వాతే అంటారు పార్టీ క్యాడర్. అయితే ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలను బట్టి కవిత.. కాస్త బీఆర్ఎస్ అధినాయకత్వానికి భిన్నంగా నడుచుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. పలు విషయాలతో విభేదిస్తూ.. తన పని తాను కవిత చేసుకుపోతున్నారట.ఇటీవల శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేసినప్పటికీ కవిత మాత్రం సభలో ఉండిపోయారు. అంతేకాదు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన సర్వేలో కేసీఆర్, కేటీఆర్ పాల్గొనలేదు. కవిత మాత్రం సర్వేలో పాల్గొని తన వివరాలు అందజేశారు. దీనితో మంత్రులు కూడా కవిత సర్వేలో పాల్గొంది.. మీకేమైంది అంటూ కేటీఆర్, కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. ఇలా కొన్ని అంశాలలో కవిత తనకంటూ ప్రత్యేకత చాటుకుంటూ.. తనకు ఉన్న ఇమేజ్ ను పెంచుకుంటూ పోతున్నారని టాక్.కాగా ఇటీవల సిద్దిపేటపై కవిత ఫోకస్ పెట్టారని బీఆర్ఎస్ క్యాడర్ భావిస్తోంది. సిద్దిపేట నుండి మాజీ మంత్రి హరీష్ రావు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. హరీష్ స్వయాన వరుసకు కవితకు బావ అవుతారు. కేసీఆర్ కుటుంబానికి సమీప బంధువైన హరీష్ రావుకు, కేటీఆర్, కవితలకు మనస్పర్థలు ఉన్నాయని పలుమార్లు వదంతులు వ్యాపించాయి. ఇలాంటి తరుణంలో కవిత ఇటీవల స్పీడ్ పెంచి ఎక్కువగా సిద్దిపేట నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పార్టీలో తనకంటూ బ్రాండ్ ఇమేజ్ ఉన్న కవిత కన్ను సిద్దిపేటపై పడిందని, రానున్న ఎన్నికల్లో కవిత పోటీ ఇక్కడి నుండే అంటూ ప్రచారం సాగుతోంది.అలాగే జగిత్యాల నుండి పోటీ చేస్తారని కూడా మరో ప్రచారం సాగుతోంది. కానీ హరీష్ రావుకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే సిద్దిపేటలో కవిత తరచూ పర్యటిస్తున్నారని, రానున్న ఎన్నికలకు ఇప్పటినుండే రూట్ వేస్తున్నట్లు కొందరి అభిప్రాయం. అదే నిజమైతే హరీష్ రావు నెక్స్ట్ పోటీ ఎక్కడి నుండి సాగుతుందనే కోణంలో కూడా చర్చలు సాగుతున్నాయి. మొత్తం మీద మీడియా ముందు మేమంతా ఒకటే అనే నినాదం అంటూ వీరు ప్రచారం సాగిస్తున్నప్పటికీ, విభేదాలు ఉన్నాయ్.. అందుకే సిద్దిపేటపై కవిత ఫోకస్ అంటూ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి ఈ ప్రచారంలో ఎంత మేరకు వాస్తవం ఉందో కానీ, మొత్తం మీద కవిత దెబ్బకు హరీష్ రావు అనుచరులు ఏ క్యాహై అనేస్తున్నారట.

# ఇక ఆన్ లైన్ లో ఇసుక బుకింగ్



**హైదరాబాద్ :** తెలంగాణలో ఇసుక కొరతను తీర్చేందుకు రేవంత్ సర్కారు చర్యలు చేపట్టింది. 24 గంటలు ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇదే సమయంలో.. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) అధికారులు చర్యలు ప్రారంభించారు. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.రాష్ట్రంలో ప్రస్తుతం చాలాచోట్ల టీజీఎండీసీ ఇసుక రీచ్‌లను నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఆయా రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా అవుతోంది.గతంలో ప్రభుత్వ రీచ్‌లు, డంపింగ్ యార్డుల్లోని ఇసుక నిల్వల వివరాలను రోజూ మధ్యాహ్నం 12 గంటలకు ఆన్‌లైన్‌లో ఉంచేవారు. 12 తర్వాతే ఇసుక బుకింగ్‌కు అవకాశమిచ్చేవారు. ఈ విధానాన్ని మార్చుతూ.. 24 గంటల ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఒక లారీ నంబర్‌పై ఒకసారి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకుంటే.. ఆ వాహనం అన్‌లోడ్ అయ్యాకే మళ్లీ డీడీ చెల్లించే సదుపాయం ఉండేది.ప్రస్తుతం ఒక లారీ నంబర్‌పై మూడు డీడీలు చెల్లించే అవకాశమిస్తున్నారు. కానీ.. 15 రోజుల్లోపే ఇసుక తీసుకెళ్లాలనే నిబంధన విధించారు.గోదావరి నది తీరం వెంట ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. గోదావరి నదితో పాటు కిన్నెరసాని, ముర్రేడు వంటి నదుల నుంచి ఇసుక యథేచ్ఛగా తరలుతోంది..స్థానికంగా ట్రాక్టర్ యజమానులు మాఫియాగా ఏర్పడుతున్నారు. నదులు, వాగుల నుంచి ఇసుకను డంప్‌లకు చేరవేస్తున్నారు. అక్కడ్నుంచి టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు..అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు సైలెంట్‌గా ఉండటంపై ఆరోపణలు వపిస్తున్నాయి. భవన నిర్మాణాలు ఊపందుకోవడంతో ఇసుకకు డిమాండ్ పెరుగుతోంది. ఇదే అదునుగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.అక్రమ రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 24 గంటలు ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.రీచ్‌ల్లో అక్రమ ఇసుక దందాకు అవకాశం లేకుండా.. పోలీస్, రెవెన్యూ, టీజీఎండీసీ అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ టీమ్‌లు నిరంతరం రీచ్‌లను పర్యవేక్షిస్తాయి...ప్రభుత్వ తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో.. ఇసుక తగినంత అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. అటు ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరుగుతుందని అంటున్నారు

# పాపం... దేవేందర్ గౌడ్



**హైదరాబాద్ :** దేవేందర్‌గౌడ్ ఒకప్పుడు తెలుగు రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన బీసీ నేత. ఎన్టీఆర్ పిలుపుతో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి రాజ్యసభ సభ్యుడిగా సుదర్ఘీ రాజకీయ అనుభవం ఉంది. ఎన్టీఆర్ కేబినెట్‌లో బీసీ మంత్రిగా, చంద్రబాబు క్యాబినెట్‌లో హోం మంత్రిపనిచేశారు. ఒక దశలో టీడీపీలో నంబర్ 2గా ఎదిగారు. కానీ ఓ తపుపడు నిర్ణయం అతడి రాజకీయ ప్రయాణానికి బ్రేక్ వేసింది. ఇక చంద్రబాబు నాయుకూడా దేవేందర్‌గౌడ్‌ను బాగా ఎంకరేజ్ చేశారు. 1988 నుంచి 2008 వరకు రాజకీయంగా ఎదురు లేకుండా ఉన్నారు. అయితే 2008లో దేవందర్‌గౌడ్ తీసుకున్న ఓ నిర్ణయం అతని రాజకీయ జీవితానికి శాపంగా మారింది. తెలంగాణ ఉద్యమం విషయంలో టీడీపీని వ్యతిరేకించి పార్టీకి రాజీనామా చేశారు.నవ తెలంగాణ పార్టీ స్థాపించారు. ఈ విషయంలో కేసీఆర్ దేవేందర్‌గౌడ్‌కు సారూప్యత ఉంది. కానీ, అది టీడీపీ నుంచి బయటకురావడం వరకే. కేసీఆర్ తెలంగాణ ఉద్యమంతో ఉవ్వెత్తున ఎగిసారు. రాష్ట్రం సాధించి తెలంగాణకు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి కూడా అయ్యారు. దేవేందర్‌గౌడ్, కేసీఆర్ లక్ష్యం ఒకటే అయినా కేసీఆర్ బానం సరైన దిశగా పయనించింది. దేవేందర్‌గౌడ్ బానం గురి తప్పింది. నవ తెలంగాణ పార్టీ విఫలమైంది. తర్వాత దేవేందర్‌గౌడ్ మరో తప్పు చేశారు. ఆయన పార్టీని ప్రజారాజ్యంలో విలీనం చేశారు. అసెంబ్లీ, పార్లమెంటుకు పోటీ చేసి ఓడిపోయారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నా ప్రజల నాటి పట్టుకోవడంలో విఫలమయ్యారు. ఆ తర్వాత తన తప్పు అర్థమైంది. దీంతో తప్పు ఒప్పుకుని టీడీపీలో చేరి రాజ్యసభ సభ్యుడు అయ్యారు. తర్వాత అనారోగ్యంతో క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యాడు.ఇక చాలాకాలం తర్వాత దేవేందర్‌గౌడ్ మళ్లీ కనిపించారు. టీడీపీతో తన సహచరుడు అయిన రేవంత్‌రెడ్డిచేతుల మీదుగా తాను రాసిన విజయ తెలంగాణ బుక్ ఆవిష్కరింపచేశారు. తొందరపాటు నిర్ణయం కారణంగా రాజకీయాల్లో ఉత్థాన పథనాలకు దేవేందర్‌గౌడ్ ఒక ఉదాహరణ.ఇక నాడు టీడీపీలో దేవేందర్‌గౌడ్ నంబర్ 2గా ఉన్న సమయంలో అట్టడుగున ఉన్నవారు ఇప్పుడు మంత్రులు, ముఖ్యమత్రి అయ్యారు. రేవంత్‌రెడ్డి నాడు ఉనికిలోనే లేరు. ఇక ఎర్రబెల్లి దయాకర్ ఎమ్మెల్యేగా ఉన్నా పెద్దగా ప్రాధాన్యం లేదు. తలసాని ఉన్నా ఆయనకు ప్రాధాన్యం లేదు. కానీ అనేక మంది టీడీపీ నేతలు టీఆర్ఎస్, అలియాస్ బీఆర్ఎస్‌లో చేరారు. తర్వాత మంత్రులు అయ్యారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి సీఎం అయ్యారు. మొత్తంగా సరైన సమయంలో నిర్ణయం తీసుకున్న కేసీఆర్, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. దేవేందర్‌గౌడ్ పొలిటికల్ కెరీర్ మాత్రం ముగిసింది.

# రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నదే చంద్రబాబు ఆశయం

**-హంద్రీ నీవా ప్రాజెక్టుకు తొలి ఆద్యుడు అన్న ఎన్టీఆరే**

**-కియా,హంద్రీ నీవా ప్రాజెక్టులు సత్యసాయి జిల్లాకు వరం**

**-గత ఐదేళ్ల జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యం-ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

**బుక్కపట్నం :** రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. బుక్కపట్నం మండలం జానకంపల్లి వద్ద రూ. 425 కోట్లతో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం పనుల్లో బాగా వేగం పుంజుకున్నాయని గుర్తు చేశారు . ముఖ్యంగా కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ప్రాజెక్టు తీసుకురావడానికీ తొలి అధ్యుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు.అదేవిధంగా సత్యసాయి జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవతో అంతర్జాతీయ కియా కార్ల పరిశ్రమ రాకతో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా గొల్లపల్లి ప్రాజెక్టు నీళ్లు రావడం వల్లనే కియా లాంటి పరిశ్రమలు వచ్చాయన్నారు. కియా, హంద్రీ నీవా ప్రాజెక్టులు ఈ ప్రాంత ప్రజలకు గొప్ప వరమన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ చేయడం వల్ల రైతులకు ఎలాంటి నష్టం ఉండదని దీనివల్ల 1 టిఎంసి నీరు పొదుపు అవుతుందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం లో 193 చెరువులతోపాటు రెండు రిజర్వాయర్లు నింపడానికి కాలువల ద్వారా నీరు పారిశుపక్కల ప్రాంతాల భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు దీనివల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఉమ్మడి జిల్లాలో వీటి వల్ల సుమారు 6లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. రాయలసీమ మరో కోస్తా ఆంధ్రగా మారి దీనివల్ల వ్యవసాయం పండ్ల తోటలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఇలాంటి మంచి పనులు చేపడుతున్న కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, హంద్రీనీవా ప్రాజెక్టు టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు మాస పుత్రిక అని అభివర్ణించారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి మన చంద్రబాబు నాయుడు అపర భగీరథుడు అని అన్నారు.హంద్రీ నీవా ప్రాజెక్టు రాకతో ఈరోజు అనంతపురం సత్యసాయి జిల్లాల్లో అంతర్జాతీయ పరిశ్రమలు వచ్చాయంటే హంద్రీ నీవా ప్రాజెక్టే కారణమన్నారు. అందుకు ప్రధాన ఆద్యుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితోనే సాధ్యమైందని అన్నారు. కర్నూలు జిల్లాలోని మాల్యాలనుంచి జీడిపల్లి రిజర్వాయర్కు కృష్ణా జిల్లాలు తీసుకొచ్చి అక్కడి నుంచి రెండో దశలో గొల్లపల్లి ,మారాలా చెర్లోపల్లి రిజర్వాయర్లను నింపితే ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు జరిగి ఇది మరో కోస్తా ఆంధ్రగా మారుతుందనన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం లోని చెరువులకు సరిపడే నీళ్లు తీసుకురావాలి అంటే ఇలాంటి లైనింగ్ పనులు చేయడం వల్ల కొన్ని టీఎంసీలు నీరు పొదుపు అవుతుందని తెలిపారు. ఈ లైనింగ్ పనులను వంద రోజుల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో బిఎస్సార్ కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. అదేవిధంగా ఈ నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ వల్ల కొన్నిచోట్ల బ్రిడ్జిలు లేకపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటికి బ్రిడ్జిలు సత్వరమే నిర్మించాలని నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా కాలువ ద్వారా చెరువులకు నీళ్లు విడుదల చేసే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా పుట్టపర్తి నియోజకవర్గానికి రెండు త్రాగునీటి ప్రాజెక్టులు తీసుకొచ్చి త్రాగునీటి సమస్య లేకుండా చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ పత్తి చంద్రశేఖర్ ,బిఆర్ఎస్ డైరెక్టర్ పూర్ణ ప్రసాద్ ప్రతినిధులు వెంకట్రావు మంజునాథ్, స్థానిక ఆర్డిఓ సువర్ణ ,ఇరిగేషన్ ఎస్ ఈ స్వరూప్ , డి.ఎస్.పి విజయ్ కుమార్ ఇరిగేషన్ ఈఈ మురళి , డి ఈ లు రేణుక వేణుగోపాల్ రెడ్డి ప్రసాద్ రావు ఏఈలు శ్రీకాంత్ రెడ్డి షబానా మధు లక్ష్మీపతి హాథిరాం , మండల కన్వీనర్ మల్లి రెడ్డి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సామకోటి ఆదినారాయణ , టిడిపి నాయకులు గంగాధర్ వెంకటనారాయణ రెడ్డి సుబ్బారెడ్డి బాలు , యశోద , లావణ్య ,మంజు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మండలంలో జిల్లా పశువైద్య అధికారుల తనిఖీ,సమీక్ష సమావేశం

**జయశంకర్ భూపాలపల్లి :** జిల్లాలోని మహాదేవ్‌పూర్ మండలంలో జరుగుతున్న 21వ పశుగణన మరియు ఇతర ముఖ్యమైన జంతు సంరక్షణ విభాగపు కార్యకలాపాలను సమీక్షించేందుకు జిల్లా పశు సంవర్ధక మరియు పశువైద్యాధికారి డా. అసోడా కుమారస్వామి, జిల్లా నోడల్ అధికారి డా. జి. వెంకన్న పుష్కపల్లి, మజీద్‌పల్లి, కాళేశ్వరం, మెట్‌పల్లి, సురారం గ్రామాలను సందర్శించారు. కాళేశ్వరం గ్రామంలో ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌కు శాశ్వత భవనం సదుపాయం గురించి చర్చించేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శితో కూలంకషంగా చర్చించారు. ఈ కేంద్రము నిర్మాణం వల్ల పశువైద్య సేవల ప్రాప్తి మెరుగుపడటంతో పాటు పశువుల ఆరోగ్య సంరక్షణకు మరింత సహాయపడుతుందని వివరించారు. సురారం గ్రామంలోని సబ్‌సెంటర్ ఏ హెచ్ ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది గైర్హాజరు గురించి వాకాబు చేశారు.మహాదేవ్‌పూర్ ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మండలంలోని పశువైద్య సిబ్బందితో కలిసి పలు అంశాలను సమీక్షించారు.రికార్డుల తనిఖీ, వివిధ పథకాలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ పరిశీలించారు.21వ పశుగణన పురోగతి, డేటా ఖచ్చితంగా మరియు సమయానికి సేకరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాక్స్ వ్యాక్సినేషన్ డ్రైవ్ అమలు పరిస్థితి, పశువులను వ్యాధుల నుండి రక్షించేందుకు టీకాలు వేయాలని ఆదేశించారు. శాంపిల్ సర్వే పురోగతి పశువుల ఆరోగ్య స్థితి మరియు ఉత్పాదకతపై విశ్లేషణ చేశారు.పోల్ట్రీలో బర్డ్ ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లుఎంజా) పరిస్థితులు, వ్యాధి నియంత్రణ చర్యలపై సమీక్షించారు. గ్రామాల్లో మేత, తాగునీరు అందుబాటు వేసవి కాలంలో పశువులకు తగిన మేత, నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా డా. అసోడా కుమారస్వామి మాట్లాడుతూ, పశుగణన డేటా సేకరణ ప్రాముఖ్యత గురించి వివరించారు. లైవ్‌స్టాక్ డేటా ఖచ్చితంగా సేకరించడం ద్వారా పశు సంవర్ధక విధానాల రూపకల్పన మరియు నిధుల కేటాయింపులో సహాయపడుతుందని పేర్కొన్నారు. పోల్ట్రీ రంగంలో బర్డ్ ఫ్లూ విస్తరణను అరికట్టేందుకు అధిక అప్రమత్తత అవసరమని, అనుమానిత కేసులు ఉంటే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశం లో మండలం లో అమలవుతున్న వ్యాధి నిరోధక టీకాలు, పశువుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నిర్ధారణ వంటి అంశాలలో ప్రొగ్రెస్ ను, ఈ సందర్భంగా వివరించారు.

# సినిమా మసాలా

# లవ్ ఎంటర్‌టైనర్ 'కాలగమనం'!



పిపిఆర్ ఫిలిమ్స్ పతాకంపై రాజా బిరుదుల, లావణ్య రామారావు, చినబాబు ప్రధాన పాత్రధారులుగా సుధాకర్ బుర్రి దర్శకత్వంలో తెరకెక్కిన లవ్, యూత్ ఫుల్ ఎంటర్టైనర్ "కాల గమనం'. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఏపీ ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు, హరిహర వీరమల్లు నిర్మాత ఏయం రత్నం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫిలిం ఛాం బర్ సెక్రటరీ మోహన్ గౌడ్‌తో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఏయం రత్నం మాట్లాడుతూ.. 'ఈ సినిమా టైటిల్ కాలగమనం ఇప్పటి పరిస్థితులు అనుగుణంగా ఉన్నట్టుంది. ఈ సినిమా సక్సెస్ అయ్యి నిర్మాతకు మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను'అని అన్నారు. చిత్ర దర్శక నిర్మాత సుధాకర్ బుర్రి మాట్లా డుతూ 'లెజెండరీ ప్రొడ్యూసర్ ఏయం రత్నం గారు మా పోస్టర్‌ను ఆవిష్కరించడం మా అదృష్టంగా భావిస్తున్నాము. సక్సెస్ ఫుల్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన ఆయన చేతులు మీదుగా ఈ పోస్టర్ ఆవిష్కరణ జరగటం మాకు ఎంతో బలాన్ని ఇచ్చింది.

## ప్రముఖ నటి హఠాన్మరణం.....!



'లిజెన్ టు మై హార్ట్', 'ది క్వీన్స్ క్లాస్‌రూమ్', 'హాయ్! స్కూల్–లవ్ ఆన్' వంటి పలు కొరియన్ డ్రామాల్లో మంచి గుర్తింపు దక్కించుకున్న నటి కిమ్ సే రాన్ (24) అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించింది. దక్షిణ కొరియాకు చెందిన నటి కిమ్ సే రాన్ తన నివాసంలో ఆదివారం (ఫిబ్రవరి 16) శవమై కనిపించింది. ఆదివారం నటి కిమ్ సే రాన్‌ను కలిసేందుకు ఆమె ఇంటికి వచ్చిన స్నేహితుడు.. ఇంట్లో నటి నేలపై పడిపోయి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటీన అక్కడికి చేరుకుని ఇంట్లోకి ప్రవేశించి చూడగా..

అప్పటికే ఆమె మృతి చెంది కనిపించింది. ఇంట్లోకి ఎవరూ బలవంతంగా ప్రవేశించిన సంకేతాలు లేవని పోలీసులు పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నటి మరణానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి దర్యాప్తు ప్రారంభించినట్లు కొరియా హెరాల్డ్ పేర్కొంది. మరోవైపు నటి కిమ్ సే రాన్ ఆకస్మిక మరణ వార్త దక్షిణ కొరియా సిఈ పరిశ్రమలో తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. నటి సహనటీనటులు, స్నేహితులు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. కిమ్ సే రాన్ మృతి పట్ల సోషల్ మీడియా వేదికగా సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా 2000 జూలై 31న జన్మించిన కిమ్ సే–రాన్ తొమ్మిదేళ్ల వయసులో నటనలోకి ప్రవేశించింది. 'ఎ బ్రాండ్ న్యూ లైఫ్' (2009), 'ది మ్యాన్ ఫ్రమ్ నోవేర్' (2010) వంటి పలు పాపులర్ మువీల్లో బాలనటిగా ఆమె నటనకు మంచి గుర్తింపు దక్కింది.

## షాహిద్‌తో ఉన్న ఈ చిన్నారి గుర్తుందా..?



సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్స్ సినిమాలతో కంటే సోషల్ మీడియాతోనే ఎక్కువగా అభిమానులను పలకరిస్తూ ఉంటారు. హీరోయిన్స్ ఫోటోలను నెటిజన్స్ సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తెగ షేర్ చేస్తూ ఉంటారు.

సందర్భం ఏదైనా సరే ఆ హీరోల ఫోటోలు, లేదా హీరోయిన్స్ ఫోటోలు నెట్టింట దర్శనమిస్తూ ఉంటాయి. తాజా ఓ హీరోయిన్ చైల్డ్ హుడ్ ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పై ఫొటోలో షాహిద్ కపూర్ తో ఉన్న నటి ఎవరో గుర్తుపట్టారా.? ఆమెకు తెలుగులో విపరీతమైన క్రేజ్ ఉంది. అంతే కాదు నార్త్ లోనూ ఈ భామను ఓ రేంజ్ ఫాలోయింగ్ ఉంది. 12 ఏళ్ల వయసులోనే స్టార్ హీరోయిన్ రేంజ్ ను అందుకుంది. ఇంతకూ ఆమె ఎవరో కనిపెట్టరా.? పెద్ద కష్టమేమీ కాదు.

## చిరు దేవుడులాంటి వారు....



బాలీవుడ్ హాట్ బ్యూటీ ఊర్వశి రౌతేలా.. నటసింహం బాలయ్య దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో వచ్చిన డాకు మహారాజ్ సినిమాలో 'దబిడి దిబిడి' సాంగ్‌తో మరోసారి తెలుగు ప్రేక్షకులను అలరించింది.

అయితే, ఈ బ్యూటీ తాజాగా మెగాస్టార్ చిరంజీవిపై చేసిన కామెంట్స్ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. చిరంజీవి గురించి మాట్లాడుతూ ఊర్వశి రౌతేలా పొగడ్తల వర్షం కురిపించింది. చిరు తనకు దేవుడి లాంటి వారని ఆమె అన్నారు. తన తల్లి కాలికి ఫ్రాక్చర్ అయ్యి, నొప్పితో బాధపడుతున్నారని మెగాస్టార్‌కు చెప్పగా, ఆయన వెంటనే వైద్యులతో మాట్లాడి తన తల్లికి మెరుగైన వైద్యం అందేలా చేశారని ఊర్వశి రౌతేలా చెప్పుకొచ్చింది. ఊర్వశి రౌతేలా ఇంకా మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవి అలా చెప్పడం కారణంగానే తన అమ్మకు సర్జరీ బాగా జరిగిందని, ఆమె తన సమస్య నుంచి పూర్తిగా కోలుకుందని, ఇప్పుడు తన తల్లికి ఎలాంటి సమస్య లేదని ఊర్వశి వెల్లడించింది. అలాగే మెగాస్టార్ చిరంజీవికి తమ కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని కామెంట్స్ చేసింది. ప్రస్తుతం ఊర్వశి రౌతేలా చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## దాన్ని దాచిపెట్టా!



సాయిపల్లవి.. ఈ పేరుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దక్షిణ భారతదేశం అంతటా ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంది. ఆమె అందం, హుందాతనంకి అభిమానులు ఫిదా అయిపోతుంటారు. గ్లామరస్ రోల్స్‌కి దూరంగా ఉంటూనే తన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు సాయిపల్లవి. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఓ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. అదేంటో కాదు.. ఆమె జాతీయ అవార్డు అందుకోవాలని ఆశపడుతున్నారట. అందుకోసం ఓ వస్తువును కూడా దాచి పెట్టిందట ఈ సుందరి. సాయిపల్లవి నటించిన 'గార్గి' చిత్రానికి జాతీయ అవార్డు వస్తుందని అంతా అనుకున్నారు. కానీ, చివరకు నిరాశే ఎదురైంది. ఓ ఇంటర్వ్యూలో సాయిపల్లవి ఏం చెప్పిందంటే.

తనకి 21 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు వాళ్ల మామ్మ ఓ చీర ఇచ్చిందని.. అది తన పెళ్లిలో కట్టుకోమని చెప్పినట్లు సాయిపల్లవి పేర్కొన్నారు. అయితే ఆ తర్వాత మూడు సంవత్సరాలకే తాను ఇండస్ట్రీకి వచ్చానని.. వచ్చిన తొలినాళ్లలో ఏదో ఒక ప్రతిష్టాత్మక అవార్డు అందుకుంటానని నమ్మకం ఉండేదని.. అప్పట్లో జాతీయ అవార్డు ఎంతో గొప్ప కాబట్టి అదే తనని వరిస్తుందని భావించినట్లు తెలిపారు.

## సొంత ఇల్లు కట్టుకున్నప్పుడు కూడా.... ఇంత ఆనందం కలగలేదు!



స్టార్ హీరో సూర్య ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. చివరిగా కంగువ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఆ ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. దాంతో ఇప్పుడు సూర్య నెక్స్ట్ సినిమా పై అభిమానులు భారీ హైప్ క్రియేట్ అయ్యింది. ప్రస్తుతం దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న సూర్య 44 లేదా..

రెట్రో చిత్రంలో సూర్య ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. ఈ సినిమాను మే 1న కార్మిక దినోత్సవం సందర్భంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆ సినిమా తర్వాత, దర్శకుడు, నటుడు ఆర్.జె. బాలాజీ దర్శకత్వం వహిస్తున్న సూర్య 45వ చిత్రంలో నటిస్తున్నాడు. ఇదిలా ఉండగా, నటుడు సూర్య అగరం ఫౌండేషన్ అనే విద్యా స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా నిన్న(ఆదివారం) చెన్నైలో అగరం ఫౌండేషన్ కొత్త కార్యాలయం ప్రారంభోత్సవానికి సూర్య హాజరయ్యారు.

## ఎన్టీఆర్ పోస్ట్‌పై బ్రహ్మీ ఫన్నీ రిప్లే....



హాస్య బ్రహ్మ బ్రహ్మానందం ప్రధాన పాత్రలో నటించిన సినిమా బ్రహ్మ ఆనందం ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. గత శుక్రవారం బ్రహ్మ ఆనందం సినిమా విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి హ్యాట్రిక్ హిట్ల తరువాత స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి 'బ్రహ్మా ఆనందం' అనే చిత్రం వచ్చింది.

ఈ సినిమాను ప్రేమికుల దినోత్సవం రోజున (ఫిబ్రవరి 14న) విడుదల చేశారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందం, అతని కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ కీలక పాత్రల్లో కనిపించారు. ఈ చిత్రానికి ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా బ్రహ్మానందం, అలాగే గౌతమ్, వెన్నలకిషోర్ తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారని చూసిన ప్రేక్షకులు అంటున్నారు. కామెడీ సీన్స్ లోనే కాదు ఎమోషనల్ సన్నివేశాల్లోనూ చక్కగా నటించి మెప్పించారు అని కొనియాడుతున్నారు.

ప్రేక్షకులు మాత్రమే కాదు సినీ సెలబ్రెటీలు కూడా ఈ సినిమా పై ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ కూడా బ్రహ్మానందం సినిమాను ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయన ఓ పోస్ట్ షేర్ చేశారు. సినిమా గురించి పాజిటివ్ విషయాలు వింటున్నాను.

## తొలితరం నటి కృష్ణ వేణి బ్యాగ్రౌండ్..



నూజివీడు అంటే ముందుగా గుర్తొచ్చేది నోరూరించే తీయని మామిడి పండ్లు.. నూజివీడు మామిడి అంతర్జాతీయ మార్కెట్లో ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందింది. నూజివీడు అంటే కేవలం మామిడి పండ్లకే కాదు కళలకు పుట్టినిల్లుగా కూడా చెప్పుకోవచ్చు.

నూజివీడులో తయారయ్యే వీణలు ఇప్పటికే ఎంతో గుర్తింపు తెచ్చుకుని ఎన్నో అవార్డులు పొందాయి. ఇంకా నూజివీడు గురించి ప్రధానంగా చెప్పుకోవలసిన విషయాలు అనేకం ఉన్నాయి. తొలి తరం తెలుగు సినిమా నటీనటులు కూడా ఇక్కడి నుంచి వెళ్ళిన వారు ఉన్నారు. అంతేకాకుండా ఎంతో వైభవోపేతంగా ఉండే ఎస్టేట్లు, కోటలు నూజివీడుకు ఎంతో ప్రాధాన్యత తీసుకువచ్చాయి. అయితే ఇప్పుడు మనం ఎందుకు నూజివీడు గురించి చర్చించుకుంటాను అనేగా మీ సందేహం.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com